ప్రజాశక్తి
శనివారం 30 మార్చి, 2024
5
శ్రీకాకుళం

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

నందిగాం: మండలంలోని మాదిగాపురం, హరిదాస్‌పురం, కామధేనువు, సవరబాణాపురం, బోరుభద్ర, తెంబూరు, సింగుపురం, మజ్జి గోపాలపురం, ఆనందపురం, బోరుభద్ర, లట్టిగాం, పెద్దరావునిపల్లి తదితర పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరల్ కమర్ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.

మాదిగాపురంలో పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఓటు వేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈయన వెంట తహశీల్దార్ పద్మావతి, విఆర్‌ఒలు ఉన్నారు.

అంతన్నారు... కొంతే కొన్నారు

- 2023 ఖరీఫ్‌లో 5.40 లక్షల టన్నులను సేకరించాలని నిర్ణయం
- కొనుగోలు చేసింది 4.49 లక్షల మెట్రిక్ టన్నులే
- కరువు, ప్రయివేట్ వ్యాపారుల ఫలితంగా తగ్గిన కొనుగోలు
- రేపటితో ముగియనున్న ధాన్యం సేకరణ

జిల్లాలో ధాన్యం కొనుగోలు ఈ నెల 31తో ముగియనుంది. ధాన్యం సేకరణలో తొలుత సాంకేతిక సమస్యలు, ధాన్యం నాణ్యంగా లేవని మిల్లరు నిరాకరించడం వంటి సమస్యలు ఎదురయినా క్రమేణా కొనుగోలు పుంజుకున్నాయి. అయితే చివరికొచ్చే సరికి లక్ష్యం మేర కొనుగోలు జరగలేదు. ఖరీఫ్‌లో ఇప్పటివరకు - లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేశారు. ఖరీఫ్‌లో కరువు పరిస్థితుల కారణంగా వేలాది ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోయారు. వర్షాలు సకాలంలో పడకపోవడంతో వేసిన పంటలూ ఎండిపోయాయి. ధాన్యం కొనుగోలులో నిబంధనలతో రైతులు వ్యాపారులకు, దళారులకు ధాన్యం అమ్ముకున్నారు. ఫలితంగా ఈ సంవత్సరం అనుకున్నంత స్థాయిలో కొనుగోలు జరగలేదనే అభిప్రాయం వినిపిస్తోంది.

బూర్జ మండలంలో ధాన్యాన్ని తరలిస్తున్న దళారులు (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఈ సంవత్సరం 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావించారు. ప్రభుత్వం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేసింది. ధాన్యం కొనుగోలుకు అధికారులు ఈ నెల 31 తేదీని గడువుగా ప్రకటించిన సంగతి విదితమే. సేకరణకు రెండు రోజులే మిగిలి ఉండగా ఇప్పటివరకు 4,48,917 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. ఇందులో గ్రేడ్-ఎ రకం 282 మెట్రిక్ టన్నులు కాగా, సాధారణ రకం 4,48,635 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ప్రభుత్వం కొనే పరిస్థితి ఉన్నా రైతుల దగ్గర ధాన్యం లేనట్లు తెలుస్తోంది. రైతులు ఆర్‌బికెల దగ్గరకు వచ్చి తమ ధాన్యం కొనాలని ఎవరూ అడగడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా తెరుచుకుంటున్నాయి.

ఆ రెండు చోట్ల వెయ్యి టన్నుల లోపే

జిల్లాలో గ్రేడ్-ఎ, సాధారణ రకం ధాన్యం కలిపి మొత్తం 4,48,635 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కంచిలిలో అత్యల్పంగా కేవలం 712 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కవిటిలో 803 మెట్రిక్ టన్నులు, ఎచ్చెర్లలో 3,374 మెట్రిక్ టన్నులు ఇచ్ఛాపురంలో 3,537 మెట్రిక్ టన్నులు, రణస్థలంలో 4,428 టన్నులు, లావేరులో 4,830 మెట్రిక్ టన్నులు. పొందూరులో 6,128 టన్నులు ధాన్యాన్ని సేకరించారు. జిల్లాలో అత్యధికంగా జలుమూరులో 32,415 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఆ తర్వాత స్థానంలో నరసన్నపేట ఉంది. నరసన్నపేటలో 27,164 టన్నులను కొన్నారు. సారవకోటలో 25,309 టన్నులను కొనుగోలు చేశారు. కోటబొమ్మాళిలో 24,301 టన్నులు, నందిగాంలో 22,503 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అదేవిధంగా మెళియాపుట్టిలో 21,624 మెట్రిక్ టన్నులు, కొత్తూరులో 20,523 మెట్రిక్ టన్నులు, మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

2022 ఖరీఫ్‌లో కొనుగోలు పరిస్థితి ఇలా...

2022-23 సీజన్‌లో 3,82,550 ఎకరాల్లో వరి సాగైంది. అందులో 8,11,120 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసి, 4.38 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఖరీఫ్‌లో సానుకూల పరిస్థితులు నెలకొనడం, పంట గణనీయంగా రావడంతో 5.40 లక్షల టన్నులను కొనుగోలు చేశారు. తొలుత 4.80 లక్షల టన్నులతో ఆపేయాలని ప్రభుత్వం భావించింది. ప్రజాప్రతినిధులపై రైతులు తీవ్ర ఒత్తిళ్ల తీసుకురావడంతో 20, 30 టన్నులు పెంచుకుంటూ చివరకు 5.40 లక్షల టన్నులతో ఆపేసింది. 2022-23 ఖరీఫ్‌లో తక్కువ లక్ష్యం నిర్దేశించుకుని ఎక్కువ కొనుగోలు జరపగా 2023-24 ఖరీఫ్‌లో ఎక్కువ లక్ష్యం నిర్దేశించుకుని తక్కువ కొనుగోలు జరపడం గమనార్హం.

లక్ష్యం చేరుకోకపోవడానికి కారణాలివేనా?

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, కవిటి మండలాల్లో కరువు పరిస్థితులు తలెత్తాయి. వీటితో పాటు పలాస నియోజకవర్గంలోని పలాస, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల నియోజకవర్గంలోని జి.సిగడాం తదితర ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంట అనుకున్నంత స్థాయిలో రాలేదు. ధాన్యం సేకరణకు ఈ సంవత్సరం విధించిన కొత్త నిబంధనలూ ధాన్యం లక్ష్యం చేరుకోకపోవడానికి మరో కారణంగా ఉంది. వాహనాలకు జిపిఎస్, మిల్లుల వద్ద రోజుల తరబడి నిరీక్షణ వంటి ఇబ్బందులు పడలేక రైతులు పలు చోట్ల దళారులకు అమ్ముకున్నారు. దీంతో పాటు ఈ సంవత్సరం ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిగా తెరుచుకోకముందే పచ్చి ధాన్యాన్ని సైతం కమిషన్ ఏజెంట్లు కొనుగోలు చేశారు. రాష్ట్రంలో పలు జిల్లాలో కరువు పరిస్థితుల కారణంగా పంట లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు జిల్లా నుంచి ధాన్యం రవాణ జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఈ సంవత్సరం ధాన్యం సేకరణ కనీసం 4.50 లక్షల టన్నులు కూడా దాటలేదు పరిమితం కానుంది.

'కళా'కు చీపురుపల్లి

- విజయనగరం ఎంపీ అభ్యర్థిగా 'కలిశెట్టి'
- భగ్గుమన్న 'కళా' అనుచరులు
- మూకుమ్మడి రాజీనామాకు సిద్ధమవుతున్న ఎచ్చెర్ల టిడిపి కేడర్

కళావెంకటరావు

అప్పలనాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, రణస్థలం

టిడిపి శుక్రవారం ప్రకటించిన చివరి జాబితా పార్టీలో మరోసారి చిచ్చు రేపింది. జిల్లాకు చెందిన సీనియర్ నేత కళా వెంకటరావుకు చీపురుపల్లి సీటు కేటాయించింది. ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన టిడిపి నేత కలిశెట్టి అప్పలనాయుడుకి విజయనగరం ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసింది. విజయనగరం ఎంపీ, చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని కళా వద్ద అధిష్టానం ప్రతిపాదించినా ఆయన తిరస్కరిస్తూ వచ్చారు. తాను ఎచ్చెర్ల నుంచే పోటీ చేస్తానని అధిష్టానానికి తేల్చి చెప్పారు. మీరుకున్నట్లే చేద్దామని కళాతో చెప్పి చివరకు ఇలా చేశారని పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు చెప్పినట్లు నియోజకవర్గ ముఖ్యనేతలు చెప్పినా ఎచ్చెర్ల నుంచే తాను పోటీ చేస్తానని దీనిపై కళా వర్గీయులు భగ్గుమన్నారు. కూటమిలో పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో భాగంగా ఎచ్చెర్ల స్థానానికి విజయనగరం బిజెపి అధ్యక్షుడు ఎన్.ఈశ్వరరావుకు ఖరారు చేస్తూ బిజెపి ఈ నెల 27న జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఎచ్చెర్ల సీటను బిజెపికి కేటాయించడంపై కుతకుతలాడుతున కేడర్‌పై శుక్రవారం ప్రకటించిన జాబితా పుండు మీద కారంలా తయారైంది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం ఏకపక్షంగా వ్యవహరించిందంటూ మండిపడుతున్నారు. ఐవిఆర్‌ఎస్ సర్వేలు అంతా బూటకమని, ఇష్టానుసారంగా సీట్లను కేటాయించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నిర్ణయంపై ఇప్పటివరకు ఓపికతో వేచి చూసిన నాయకులు, కార్యకర్తలు తమ నిరసనను పార్టీకి తెలియజేయాలని నిర్ణయించారు.

అనూహ్యంగా ఎంపీ అభ్యర్థిగా 'కలిశెట్టి'

విజయనగరం టిడిపి ఎంపీ అభ్యర్థిగా అనూహ్యంగా కలిశెట్టి అప్పలనాయుడు పేరును పార్టీ ఖరారు చేసింది. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరును చీపురుపల్లి అసెంబ్లీ, విజయనగరం ఎంపీ అభ్యర్థిత్వానికి పార్టీ ఐవిఆర్‌ఎస్ నిర్వహించింది. దీంతో, గీతకు ఈ రెండింటిలో ఏదో ఒక సీటు ఖాయమంటూ చర్చ నడిచింది. ఆచరణలో అటువంటిదేమీ లేకపోవడంతో ఆమెతో తన అనుయాయులు ఖంగుతిన్నారు. ఎంపీ అభ్యర్థిగా డెంకాడ ఎంపిపి కంది చంద్రశేఖర్ పేరు కూడా పరిశీలనకు వెళ్లినప్పటికీ చివరి క్షణాల్లో తిరస్కరణకు గురైంది. దీంతో కలిశెట్టికి ఎంపీ అభ్యర్థిత్వం వరించింది. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి విజయనగరం ఎంపీ స్థానానికి అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడు గుర్తింపు పొందారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అప్పలనాయుడు రణస్థలం మండలం వి.ఎన్.పురానికి చెందిన వారు. కలిశెట్టి సూరప్పమ్మ, బోడినాయుడు దంపతులకు 1975 నవంబరు 8న జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీలో బిఎ, బిఎల్ విద్యాభ్యాసం పూర్తి చేశారు. పలు పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు.

పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

మందస: మందస పట్టు పరిశ్రమ భూములు ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని చీపి రోడ్డులోని బ్రిడ్జి స్కూల్‌కు సమీపంలో గల గిరిజనాభివృద్ధి సంస్థకు చెందిన ప్రభుత్వ పట్టుపరిశ్రమ భూములను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు మాట్లాడుతూ పట్టుపరిశ్రమ భూముల్లో కొంతమంది అక్రమంగా కంకర తవ్వకాలు చేసి లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారని, మరికొంత భూమి చదును చేసి మొక్కలు వేసుకోవడంతో పాటు భవన నిర్మాణం కూడా చేసుకున్నారని విమర్శించారు. గతంలో ఉన్న జీడి చెట్లు చుట్టూ మట్టిని తొలగించడంతో ఆ చెట్లు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఇదంతా జరుగుతున్నా... కనీసం అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమ న్నారు. ప్రజావసరాలకు ఉపయోగించాల్సిన భూములు అన్యాక్రాంతమవుతుంటే అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పన్నెత్తి మాట్లాడడం లేదని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూములను పరిశీలించాలని, వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఆ భూములు పట్టు పరిశ్రమ అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. మందస గిరిజన ప్రాంతంలో పట్టుగూళ్ల పెంపకానికి ప్రాధాన్యత ఇచ్చి ఆ భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అండదండలు ఉన్న నాయకులు గిరిజన ప్రాంతాల్లో భూములు ఆక్రమించుకుంటున్నారని, వారికి కొంత మంది రెవెన్యూ అధికారులు సహాయపడుతున్నారని అన్నారు. కానీ, ఆక్రమణదారులపై ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మజ్జి త్రినాథ్‌బాబు, కొర్లె హేమారావు, చౌదరి, పౌరహక్కుల సంఘం నాయకులు సోమనాథం, గిరిజన సంఘం నాయకులు సవర ఫాల్గొనరావు, సవర గురునాథ్, సవర నరసింహులు పాల్గొన్నారు.

సంయమనం పాటించాలి

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్ : క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కేడరంతా ఎంత నిబద్ధత వ్యవహరిస్తున్నారో.. అంతే సంయమనం పాటించి సహకరించాలని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ కోరారు. నగరంలోని అరసవల్లిలోని ఆయన నివాసంలో కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడ్ ఆఫ్ కండాక్ట్ అమలులో ఉన్నందున తాము పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించడం లేకపోతున్నామని తెలిపారు. 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలని ఎలక్షన్ అబ్జర్వర్లు చెప్పడంతో వేడుకల నిర్వహణ ఏర్పాట్లను విరమించుకున్నామని చెప్పారు. క్రమశిక్షణ కలిగిన టిడిపి కుటుంబ సభ్యులు మరిన్ని రోజులు సంయమనం పాటించి ఐక్యతతో మెలగాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, మాదారపు వెంకటేష్, చిట్టి నాగభూషణం, తోనంగి వెంకన్న యాదవ్, లోపింటి రాధాకృష్ణారెడ్డి, సింతు సుధాకర్, డాక్టర్ జామి భీమశంకర్, జల్లు రాజీవ్, గండేపల్లి కోటేశ్వరరావు, ఎస్.వి.రమణమాదిగ, సురకాశి వెంకటరావు, ఉంగటి వెంకటరమణ పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చా

పశు సంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

2019 ఎమ్మెల్యే ఎన్నికల ముందు పలాస నియోజకవర్గంలో ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఆ సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చానని పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తాను కాశీబుగ్గలో రైతుబజార్ నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీను నేరవేర్చాలేక పోతానని పేర్కొన్నారు. అందుకు కారణం ఆ స్థలం న్యాయపరమైన వివాదంలో ఉండడంతో నిర్మాణం చేపట్టలేకపోయామని చెప్పారు. గత పాలకలు రైల్వే ఫ్లైఓవరు పనులు విడిచిపెడితే... ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత పనులు చేపట్టానని అన్నారు. 14 ఏళ్లుగా ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు నత్తనడకన సాగుతుంటే... వైసిపి ప్రభుత్వంలో పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. జీడి రైతులకు వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ప్రతి సారీ ప్రతిపక్ష నాయకులు రైతులకు సాగునీరు అందించలేదని ఆరోపణలు చేసేందుకు సిగ్గుపడాల న్నారు. అందుకు టిడిపి నాయకులు టెక్కలి నియోజకవర్గంలో అనుమతులు లేని లిఫ్ట్ ఇరిగేషన్లు నిర్మాణం చేపట్టడంతో పలాస నియోజకవర్గంలో శివారు భూములకు వంశధార నీరు అందలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కిడ్నీ రోగులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో రూ.50 కోట్లతో 200 పడకల ఆస్పత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రం, ప్రతి ఇంటికీ శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో రూ.700 కోట్లతో తాగునీటి పథకానికి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశామన్నారు. పలాస డివిజన్ కేంద్రంతో పాటు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామని అన్నారు. పలాస నియోజకవర్గం లో 380 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అందుకు సంబంధించి భూసేకరణ చేపట్టామన్నారు. గౌతు కుటుంబం ప్రజలను అణచివేస్తారని, ఇది టిడిపి సర్వేలో తేలడం వల్లే గౌతు శిరీషకు టిక్కెట్ కేటాయింపులో ఆలస్యమైదని వాఖ్యానించారు.

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

డిసిసి అధ్యక్షులు పరమేశ్వరరావు

మాట్లాడుతున్న పరమేశ్వరరావు

ఇచ్ఛాపురం: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రాహుల్ గాంధీ నిరంతర పోరాటం చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. పట్టణంలోని మసీద్ వీధిలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోడీ విధానాలపై రాహుల్‌గాంధీ యుద్ధం చేస్తున్నారని అన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ గట్టిపోరాటం చేస్తుందన్నారు. అప్పటి కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయం పెద్దన్న పాత్ర అని, ఇప్పుడు రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా ఎవ్వరికీ రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించలేదని స్పష్టం చేశారు. జిల్లాలో అన్ని నియోజికవర్గలో పోటీ చేయాలని అనేక మంది ఆశావహులు ఉన్నారని అన్నారు. త్వరలో అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వై.ఎస్.షర్మిల నాయకత్వంలో ముందుకు వెళ్తుందని అన్నారు. అనంతరం బిజెపి నుంచి తులసీరావుతో పాటు తొమ్మిది మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం సమన్వయ కమిటీ సభ్యులు మాసు పత్రీ చక్రవర్తిరెడ్డి, ఆలీం ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, రాష్ట్ర ఎస్‌టి డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శి మధుసూదనరావు, మండల అధ్యక్షులు పాపారావు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువు

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్



మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, యల్లు రఘునాథరెడ్డిలు విమర్శించారు. నగరంలోని క్రాంతి భవనంలో జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి అధ్యక్షతన ఎస్‌టియు జిల్లా కార్యవర్గ ప్రథమ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 117 వల్ల ప్రభుత్వ విద్యా రంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. మరోవైపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఆర్‌సి, డిఎ తదితర బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చర్చల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేక పోయిందన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో చేస్తున్న ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ 22-బి మేరకు వేతన స్థిరీకరణకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేపట్టే విద్యాపరమైన సంస్కరణలు పేద, బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాల ప్రజలకు దగ్గర చేసేవిగా ఉండాలన్నారు. బోధనేతర సిబ్బందికి జెఎల్ ఉద్యోగోన్నతులు కల్పిస్తున్న ప్రభుత్వం అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జెఎల్‌గా ఉద్యోగోన్నతి కల్పించడం లేదని అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం ఒక్క సమస్యా పరిష్కరించకుండా కాలయాపన చేయడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినాయుడు, ఆర్థిక కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తనిఖీల్లో పట్టుబడితే లెక్క చెప్పాల్సిందే

పత్రాలు లేని ఆర్థిక లావాదేవీలపైనా దృష్టి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కోడ్ అమలులోకి వచ్చిం ది. పోలీసు బలగాలు ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఘటనలు జరిగినా యంత్రాంగం కఠిన చర్యలు తప్పవు. ఎన్నికల కోడ్ అమలు సమయంలో పెద్దమొత్తంలో నగదు, బంగారం, తాయిలాలు అందించేందుకు క్రికెట్ కిట్లు, ఇతర బహుమతులు నియోజకవర్గ కేంద్రాలకు తరలించకుండా అడ్డుకట్ట వేసేపనిలో యంత్రాంగం నిమగ్నమైంది. అయితే పెళ్లి, ఇతర శుభకార్యాలు, భూముల కొనుగోలు, అమ్మకాలు సమయంలో ఆదమరచి పెద్దమొత్తంలో డబ్బు తమతో పాటు తీసుకెళ్లినప్పుడు సరైన పత్రాలు చూపాల్సి వస్తుంది. రూ.50 వేలకు మించి నగదు పట్టుబడితే తప్పక ఆధారాలు చూపాల్సిందే.

జిల్లాలో అంతర రాష్ట్ర సరిహద్దులు, అంతర జిల్లా సరహద్దుల్లో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రత్యేక తనిఖీ కేంద్రాలు (చెక్‌పోస్టు) ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్నీ తనిఖీలు చేస్తున్నారు. నగదు, బంగారు ఆభరణాలు, మద్యం రవాణా జరగకుండా ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు. అయితే జిల్లాలో అత్యంత పొడవైన జాతీయ రహదారి, తూర్పు నుంచి దక్షిణ సరిహద్దుల్లో ఒడిశా భూభాగం ఉండడం వల్ల నిత్యావసర సరకులు మొదలు నాటు సారా, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు పెద్దఎత్తున రవాణా ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అందులో భాగంగానే ఎక్కడికక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 11 చెక్‌పోస్టుల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాల్లో తనిఖీల్లో ఆధారాల్లేని నగదు, ఇతర వస్తువులు పట్టుబడుతున్నాయి.

ఇలా పాటించాలి...

'అపరిచిత వ్యక్తులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వ్యక్తిగత ఖాతాలకు నగదు జమ చేసే అవకాశం ఇవ్వొద్దు. గత ఆరు నెలల్లో ఖాతాల్లో జమైన మొత్తాలకు మించి నగదు జమ కాకుండా చూసుకోవాలి. ఒకవేళ ఖాతాలో జమైన మొత్తాలకు సంబంధించి అధికారుల్లో అనుమానం ఉంటే ఆధారాలు చూపేందుకు సిద్ధంగా ఉండాలి. అవకాశం ఉన్నంద వరకు ఇతరులకు ఖాతా సంఖ్యను చెప్పకపోవడం మంచిది. వివాహాలు, శుభ కార్యాలు, అత్యవసర వైద్య ఖర్చులు, వ్యాపార చెల్లింపులు చేసేవారు తగిన ఆధారాలతోనే నగదు తీసుకెళ్లాలి. ఆన్‌లైన్ చెల్లింపుల వివరాలూ ఉంచుకోవడం ఉత్తమమని పోలీసులు సూచిస్తున్నారు. వ్యక్తిగత, కుటుంబ అవసరాల కోసం ఒక వ్యక్తి ఎన్నికల సందర్భంగా రూ. 50వేల వరకే తీసుకెళ్లేందుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. అంతకంటే ఎక్కువ ఉంటే అందుకు సంబంధించి ఆధారాలు చూపాలి. అలాగే బ్యాంకులోని అనుమానాస్పద లావాదేవీలపైనా ప్రత్యేక నిఘా ఉంటుంది. ఒకవేళ ఖాతాల్లో నిర్ణీత నగదుకు మించి జమైతే సీజ్ చేసే అవకాశముంది. అభ్యర్థులు, ముఖ్య నాయకులు వారి బంధువుల ఖాతాల్లోని లావాదేవీలపైనా ప్రత్యేక నిఘా ఉంచుతామని జిల్లా యంత్రాంగం చెపుతోంది.

ఎన్నికల కోడ్ ప్రతిఒక్కరికీ వర్తిస్తుండటంతో సామాన్యులు సైతం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. దక్షిణాధి రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉన్న ఇచ్ఛాపురం మీదుగా ప్రతినిత్యం వేల సంఖ్యలో వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. బంగారం, వెండితో పాటు అనేక రకాలైన వస్తువులు ఎగుమతులు, దిగుమతులు జరుగుతుంటాయి. దీనికితోడు వివాహాలు, గృహప్రవేశాలు, ఇరత ఫంక్షన్ల సీజన్ కావడంతో బంగారం, వెండి, వస్తువులతో పాటు దుస్తులు భారీగా కొనుగోలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టు సరైన వివరాలు లేకపోతే ఇబ్బందులు తప్పవు. వీటి కొనుగోలుకు తీసుకెళ్లే నగదు విషయంలోనూ జాగ్రత్తగా తీసుకోవాలని అధికారులు చెపుతున్నారు. కొనుగోలు తర్వాత బిల్లు తీసుకోవడం తప్పనిసరి.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ఒడిశా నుంచి ఆంధ్రాలోకి ప్రవేశించేందుకు అనేక దారులు ఉన్నాయి. ఈ దారులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అలాగే మెళియాపుట్టి, పలాస, మందస, కంచిలి, ఇచ్ఛాపురం ప్రాంతాలు ఒడిశా సరిహద్దును ఆనుకుని ఉన్నాయి. ఈ ప్రాంతాలకు నాటు సారా యథేచ్ఛగా జిల్లాలోకి వచ్చి చేరుతుంది. అలాగే మద్యమూ అడ్డదారుల్లో తరలిస్తుంటారు. మరోవైపు రైలు మార్గాన అక్రమ మద్యం, గంజాయి రవాణాపై పోలీసుల నిఘా ఉంది. ఇటీవల పొందూరు, సోంపేట, సరుబుజ్జిలి, జి.సిగడాం మండలాల్లో వాహనాల్లో తరలిస్తున్న నగదు పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండకపోతే ఇబ్బందులు తప్పవు.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA215/2024 IA 216/2024
IA 217/2024 in OS 91/2015

పిటిషర్/వాది :- లెంక మోహనరావు
రెస్పాండెట్స్/ప్రతివాదులు:-
చౌదరి తిరుమల కుమార్ (Died), వగైరాలు.
To,
R-4: లెంక. భాగ్యలక్ష్మి, భర్త లేటు క్రిష్ణారావు, సాౣనాౣ నందివాడ గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా,
R-5: లెంక సాయి, తండ్రి లేటు క్రిష్ణారావు, సాౣనాౣ నందివాడ గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా,
R-6: లెంక సుధీర్, తండ్రి లేటు క్రిష్ణారావు, సాౣనాౣ నందివాడ గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా,

పై నెంబరు పిటిషనర్/వాది మిమ్మలను లెంక క్రిష్ణారావు, **(D-3)** తాలూకా వారసులుగా చేర్పించమని కోరుచూ పై నెంబరు పిటిషన్లు దాఖలు చేసి యున్నందున అందుకు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారి సమక్షం అందు **తేౣ18-04-2024దిౣన ఉదయం గంౣ 10. 30 నిౣ లకు** మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరు అయి. మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకోగలరు లేని ఎడల మీపరోక్షంఅందు తీర్మానించడం జరుగునని తెలియజేయడమయనది.

తేది:30.03.2024,
రాజాం.

శ్రీ. కె. రమణమూర్తి
శ్రీమతి. బి. మంజుల
న్యాయవాదులు,
పొందూరు.

అధికారులతో సమీక్షిస్తున్న సుదర్శన్‌దొర

పోలీసు అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రానున్న ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల వారీగా బందోబస్తు, రూట్ మ్యాప్ తదితర అంశాలపై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్ఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ లక్ష్మణ రావు, కవిటి ఎస్ఐ రాము, మండల సర్వేయర్ తవిటి నాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస : వైసిపిలో చేరిన వారితో స్పీకర్ సీతారాం

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

సరుబుజ్జిలి మండలంలోని మూలసవలాపురంకు చెందిన పలువురు యువకులు స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. సిరిపల్లి శ్రీను, కర్రి గణేష్, పున్నపు రెడ్డి తవిటినాయుడు, రమణమూర్తి తదితరులు టిడిపిని వీడి వైసిపిలో శుక్రవారం చేరారు. పార్టీలో చేరిన యువకులకు రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, బిసిసెల్ డైరెక్టర్ మూడడ్ల రమణ, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ ఆత్తలూరు రవికాంత్ పాల్గొన్నారు.

రణస్థలం : ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం పంచాయతీలో టిడిపి నుంచి బొత్స శశిభూషణ్ ఆధ్వర్యాన 15 దళిత కుటుంబాలు వైసిపిలో చేరారు. వీరిని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా వైసిపి పనిచేస్తుందని అన్నారు. పార్టీలోకి చేరిన వారిలో బలగ హరిబాబు, బలగ బలరాం, బలగ రామయ్య, మడపాన దాలయ్య, దాసరి పోలయ్య, లింగాల సురేష్, లింగాల దుర్గారావు, రాకోటి రామారావు తదితరులు ఉన్నారు.

శిరీషను సన్మానిస్తున్న శ్రీశయన సంఘ నాయకులు

యువతకు ఉద్యోగావకాశాలు లేవు

పలాస: వైసిపి ప్రభుత్వంలో యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆమె యువతను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధి, ఉద్యోగం లేక రోడ్డున పడ్డారని, విద్యార్థులకు కనీసం ప్రోత్సాహం కూడా ఇవ్వలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థులకు ప్రోత్సాహంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో బి.తారకేశ్వరరావు, బి.ఉదయ్ కిరణ్, ఎస్.నిరంజన్, కిరణ్, పవన్, జగదీష్, దిలిప్ పాల్గొన్నారు.

శిరీషకు సన్మానం

పలాస టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లా శ్రీశయన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. పలాస టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో ఎమ్మెల్యే, ఎంపీ రామ్మోహన్ నాయుడుకు శ్రీశయన సంఘం అండగా ఉండి గెలిపిస్తామని స్పష్టం చేశారు. శ్రీశయన సంఘ నాయకులు రమణ, రాము, మూర్తి, వెంకటేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొండు శంకర్

టిడిపి మేనిఫెస్టోతో వైసిపిలో వణుకు

శ్రీకాకుళం రూరల్: టిడిపి మేనిఫెస్టోతో వైసిపిలో వణుకు పుట్టిస్తుందని శ్రీకాకుళం టిడిపి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. మండలంలోని కల్లేపల్లిలో శుక్రవారం నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 300 మంది బిసిలపై వైసిపి నాయకులు దాడులు చేశారని అన్నారు. బిసి రక్షణ చట్టాన్ని తీసుకొచ్చే దిశగా టిడిపి కృషి చేస్తుందని అన్నారు. అనంతరం టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

టిడిపిలో పలువురు చేరిక

పలాస: శాసనం నూతన టిడిపి కార్యాలయం వద్ద గౌతు శిరీష అధ్వర్యంలో మందస మండలం బిడిమికి చెందిన జుత్తు రుక్మాంగదరరావు, జుత్తు రామారావు, మోట్టూరు సింహాచలం, చెల్లూరు ధర్మారావు, బహడపల్లికి చెందిన సాలిన కూర్మారావు, వజ్రపుకొత్తూరు మండలం కాశీనగర్‌కు చెందిన దున్న అప్పలనర్సమ్మ, గుల్ల రుక్మాంగదరరావు, గుల్ల రుక్మిణీ వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జుత్తు కూర్మారావు, జుత్తు అమ్మినాయుడు, కూర్మాపు రామారావు, తామాడ తుంభనాధం, బొడ్డు ఉమాపతి, తిమ్మల పున్నయ్య పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని 22వ వార్డు లక్ష్ముడుపేటకు చెందిన వైసిపి కార్యకర్తలు టిడిపి కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారికి రవికుమార్ టిడిపి కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పేడాడ రవికుమార్, రామారావు, బిర్లంగి కోటేశ్వరరావు, గున్న పురుషోత్తమరావు, చింతాడ ఉదయ్ కుమార్, పైడి రాజశేఖర్, తమ్మినేని రాము, సనపల చలపతిరావు ఉన్నారు.

ఇంటింటా గాంధీ ప్రచారం

ఆమదాలవలస: ప్రజా సంక్షేమం, ప్రజల హక్కుల కోసం పాటు పడతానని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి మండలంలోని విజయరాంపురం, కాగితాపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజల కోసం పాటు పడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆమదాలవలస పట్టణంలోని18వ వార్డుకు చెందిన టిడిపి నాయకుడు అన్నెపు సూరిబాబు గాంధీకి మద్దతు పలికారు. అప్పలనాయుడు, బెండి పాపారావు, ఇల్లాకుల శ్రీను, భాను, సింహాచలం, సింహాలు, రాజు, ఆదినారాయణ, రవి, గోపి పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

కోటబొమ్మాళి : ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఏర్పడిన పార్టీ టిడిపి అని రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టిడిపి అవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయ అవరణలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాల సుదీర్ఘ చరిత్రలో టిడిపి ఎన్నో ఆటుపోట్లు చవిచూసిందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టెక్కలి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షులు పూజారి శైలజ, మాజీ ఎంపిపిలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో జెండాను ఎమ్మెల్యే అభ్యర్థి గుండ శంకర్ ఎగురవేశారు.

నరసన్నపేట: టిడిపి నాయకులు, ఉమ్మడి కూటమి అభ్యర్థి బగ్గు రమణమూర్తి జట్టు కళాసి యూనియన్ కార్యవర్గ సభ్యులను శుక్రవారం కలిశారు. టిడిపి కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేశారు. పార్లమెంట్ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, రాష్ట్ర ఎస్‌సి సెల్ సెక్రటరీ బెవర రాము, మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బైరి భాస్కరరావు, పట్టణ అధ్యక్షులు రామారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండల, మున్సిపాలిటీ టిడిపి నేతల అధ్వర్యంలో టిడిపి అవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో బెల్లుపడా, అచ్చంపేట జంక్షన్, టిడిపి కార్యలయం వద్ద ఈ వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కాళ్ల ధర్మారావు, సాలీనా ఢిల్లీ, నందిక జాని, దక్కత ఢిల్లీరావు, కాళ్ల జయదేవ్, కొండ శంకర్ రెడ్డి, లీలారాణి, సహదేవ్ రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ శివారున పారిశ్రామికవాడ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పార్టీ జెండాను మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత ఎగురవేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళి, బోర గోవిందరావు, కూన వెంకట రాజ్యలక్ష్మి, బోయిన సునీత, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, పి.వి.ఎన్ మాస్టారు పాల్గొన్నారు.

నరసన్నపేట : జెండాను ఆవిష్కరిస్తున్న రమణమూర్తి

పలాస: స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ మంత్రి గౌతు శివాజీ, ఆయన సతీమణి విజయలక్ష్మి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం టిడిపి జెండాను ఆవిష్కరించారు. మందస మండలం హరిపురం పార్టీ కార్యాలయం వద్ద టిడిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పోస్టర్‌ను అందజేస్తున్న రాజ్యలక్ష్మి

వైసిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సిఎం జగన్ మోహన్ రెడ్డితో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో 1, 2 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అమలు తీరుపై వివరిస్తూ రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు ప్రకాశరావు పట్నాయక్, ప్రేమకుమార్, చాట్ల పుష్ప, తిరుపతి, కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, పిలకా సంతోష రెడ్డి, సాలీనా గాంధీ పాల్గొన్నారు.

పోలాకి: మండలంలో కొత్తరేవు పంచాయతీలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వంలో జరిగే సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మాన రామలింగం నాయుడు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగి నాయుడు, మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, వైసిపి నాయకులు ఎస్.రాఘవ్, ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు.

పలాస: మండలం గరుడఖండిలో వైసిపి నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజును రానున్న ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, గొండు మోహనరావు, సర్పంచ్ బొత్స రాజేశ్వరి, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలాకి : ప్రచారం చేస్తున్న కృష్ణచైతన్య, తదితరులు

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ఆమదాలవలస : మహిళకు పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర అభివృద్ధికి టిడిపి, జనసేన, బిజెపి కూటమిని ప్రజలందరు గెలిపించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్ ప్రజలను కోరారు. శుక్రవారం పురపాలక సంఘంలోని 10వ వార్డు పరిధిలో మెట్టక్కివలసలో మండల వీధి, గాంధీ నగర్, హడ్కో కాలనీ, ప్రాంతాల్లో జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహనరావు, బిజెపి కన్వీనర్ పేడాడ సూరపునాయుడుతో కలిసి శంఖారావంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్‌కు మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో రెడ్డి పాలనలో అరాచకం రాజ్యమేలుతుందని, దీనిని పారద్రోలాలంటే వజ్రాయుధం లాంటి ఓటును ఎన్‌డిఎ కూటమికి వేసి ప్రజాస్వామ్యాన్ని బతికించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమ్మినేని గీతా సాగర్, కూన వెంకట రాజ్యలక్ష్మి, బోర గోవిందరావు, నాగళ్ల మురళీధర్, తంగి గురయ్య, లంక నాగరాజు, మొదలవలస రమేష్, కణితి విజయలక్ష్మి భాయ్, నూకరాజు, ఢిల్లీశ్వరరావు, అన్నెపు భాస్కరరావు పాల్గొన్నారు.

కవిటి: మండలం బెజ్జిపుట్టుగలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల పాల్గొన్నారు. ముందుగా చక్ర పెరుమాళ్ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు పథకాలు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస: మండలం రెంటికోట, పెదంచలలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఢిల్లీరావు, మోహనరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస : ప్రచారం చేస్తున్న శిరీష

కవిటి : బెజ్జిపుట్టుగలో ప్రచారం చేస్తున్న నీలోత్పల

మందస మండలం పొత్తంగిలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పొత్తంగి గ్రామకమిటీ అధ్యక్షుడు కొర్రాయి సూర్యనారాయణ, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, నవీన్ కుమార్, మండల లచ్చయ్య, పత్రి లక్ష్మణరావు, బుద్దెపు కృష్ణారావు, కత్తిపు జగన్నాధం పాల్గొన్నారు.

అమలమ్మకు నగదును అందజేస్తున్న కార్మికులు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం అరినాం అక్కివలస వద్ద ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న గాడు పారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ కుటుంబం జీవనాధారం కోల్పోయిన నేపథ్యంలో నాగార్జున అగ్రికం పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులంతా తమ ఒకరోజు వేతనాన్ని మృతుని కుటుంబానికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. పరిశ్రమ వద్ద నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో మృతుని భార్య అమలమ్మకు కార్మికుల నుంచి వసూలు చేసిన ఒకరోజు వేతనం రూ: 1,07,000 అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నాగార్జున అగ్రికం వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వరదరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు ఇచ్చి ఆదరించాలని పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని కొర్లకోటలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ప్రజలను దోచుకున్నాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి పేద కుటుంబానికి నెలకు రూ. 5వేలు, రూ.500 గ్యాస్ సిలిండర్, ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ వంటి హామీలను అమలు చేసి తీరుతుందన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో వచ్చే యాత్రికుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన గొంటు శ్రీనుబాబు, రేణుక దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలసి వారు అరసవల్లి సందర్శించారు. అనంతరం ఇఒ చంద్రశేఖర్‌ను కలసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు.

చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

కవితలు, వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్ : 'సమాజాభివృద్ధి-యువత పాత్ర' అన్న అంశంపై జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన కవితలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుప్పిలి కామేశ్వరరావు, గొంటి గిరిధర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది వేడుకలను పురస్కరించుకొని జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కవితలు ఒకటి, రెండు పేజీలకు, వ్యాసరచన రెండు, నాలుగు పేజీలకు మించకుండా తెలుగు, ఇంగ్లీష్‌లో రాసి, తమ స్వీయ రచనగా ధ్రువీకరిస్తూ పూర్తి అడ్రస్‌తో కూడిన రచనలను గొంటి గిరిధర్ 85009608403కి టెలిగ్రామ్/ వాట్సాప్/మెయిల్ ద్వారా పంపించాలన్నారు. giridhar. gonti69@gmail.com చేయవచ్చన్నారు. ఈ పోటీల్లో వయో భేదం లేకుండా విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు పాల్గొనవచ్చునని అన్నారు. వచ్చే నెల 6లోగా రచనలు పంపించాలన్నారు. ఉత్తమ రచనలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఓటింగ్ శాతం పెంపుపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

సార్వత్రిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరగడానికి, ముఖ్యంగా మహిళా ఓటర్లు శత శాతం పోలింగ్‌లో పాల్గొనేటట్టు చైతన్యపర్చడానికి మహిళా సంఘాలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నామనిమండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అన్నారు. మండల కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడారు. మండలంలో తక్కువ పోలింగ్ శాతం ఉన్న 16 కేంద్రాలను అధికారులు గుర్తించారని అన్నారు. ఎపిఎం పైడి కూర్మారావు ప్రతివ్యక్తికీ రాజ్యాంగపరంగా ఓటే వజ్రాయుధమని, దానిని నిజాయితీగా వినియోగించుకోనేటట్లు గ్రామీణ మహిళలందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, చంద్రరావు, సుభద్ర పాల్గొన్నారు.

కవిటి : సహలాలపుట్టుగలో మానవహారం నిర్వహిస్తున్న మహిళలు

కవిటి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు అనేది ముఖ్యమైన అంశమని, దేశ భవిష్యత్‌తో పాటు తమ భవిష్యత్తు ఓటు అనే ఆయుధంపై ఆధారపడి ఉంటుందని ఎపిఎం గోవిందరావు అన్నారు. ఎస్వీపి ఆధ్వర్యాన శుక్రవారం జగతి, బెజ్జిపుట్టుగ, సహలాలపుట్టుగ పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఓటుహక్కు ప్రాధాన్యత, అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మానవహారం నిర్వహించి ఓటు హక్కు ప్రాధాన్యత వివరిస్తూ నినాదాలు చేశారు.

నందిగాం: మండలంలోని కవిటిఅగ్రహారం, పి.వి.పురం, హరిదాసుపురం, మర్లపాడు, దేవలభద్ర తదితర గ్రామాల్లో వెలుగు, ఎపిఎం జాంబవతి ఆధ్వర్యాన ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీలు, మానవహారం, సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.

నందిగాం : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కాలువకు మరమ్మతులు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ టెలిఫోన్ కార్యాలయ సమీపంలో కాలువ మరమ్మతులకు గురికావడంతో వాహన చోదకులతో పాటు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత మున్సిపల్ సమావేశంలో వార్డు కౌన్సిలర్లు కాలువ మరమ్మతుకు గురైందని, నిరంతరం అటువైపు బస్సులు, వాహనాలతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి దగ్గరుండి కాలువ మరమ్మతులు చేపట్టారు. కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి బస్సులతో పాటు ద్విచక్ర వాహనాలు రాకపోకలు జరిగే విధంగా పనులు చేపట్టారు. ఆయనతో పాటు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కాలువ మరమ్మతులు చేయిస్తున్న కమిషనర్ నాగేంద్రకుమార్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

హేమావతి (ఫైల్)

రెండు స్కూటీలు ఢీకొన్న సంఘటనలో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సిహెచ్ రామారావు వివరాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అక్కుపల్లికి చెందిన మడ్డు హేమావతి (34) తన స్కూటీపై అదే గ్రామానికి చెందిన అర్జాల నాగమణితో కలసి కాశీబుగ్గ నుంచి మార్కెట్ ముగించుకుని గ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో గరుడుభద్ర నుంచి కాశీబుగ్గ వైపు స్కూటీపై వెళ్తున్న అక్కుపల్లికి చెందిన ఇద్దరు యువకులు అజయ్, హృదయ్‌లు ధర్మపురం చెరువు వద్ద పరస్పరం గుద్దు కోవడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రగాయాల పాలయ్యారు. వీరిని స్థానికులు 108 వాహనంలో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మడ్డు హేమవతి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి భర్త నవీన్ దుబాయిలో వలస కార్మికుడిగా పని చేస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ రాజేష్

96 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో సిరియాకండి వద్ద ఎన్నికల ఎస్ఎఫ్‌టి టీం తనిఖీల్లో 96 మద్యం బాటిళ్ల పట్టుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. శుక్రవారం వాహనాల తనిఖీలను పైల శివరామకష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా పొగడవెల్లి గ్రామానికి చెందిన జన్ని గంగాధర్, పి.కృష్ణారావు 96 మద్యం బాటిళ్లతో పర్లాకిమిడి నుంచి పొగడవెల్లి ఆటోపై వెళ్తుండగా సిరియాకండి వద్ద తనిఖీల్లో పట్టుబడ్డారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు.

బార్ అధ్యక్షునిగా రమణయ్యరెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రమణయ్యరెడ్డి

బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సీనియర్ న్యాయవాది ఎన్.రమణయ్య రెడ్డి, కార్యదర్శిగా సీనియర్ న్యాయవాది ఎన్.వి.ఎస్ రంగారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా అర్. దేవరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే ఎంపీగా పోటీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సీతరాజు

జై భారత్ నేషనల్ పార్టీ నాయకత్వం ఆదేశిస్తే శ్రీకాకుళం లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేస్తానని పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ ఇప్పిలి సీతరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రజలందరూ నీతి నిజాయితీతో కూడిన రాజకీయ నాయకులు కావాలని కోరుకుంటున్నారని అన్నారు. అటువంటి నీతి, నిజాయితీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ వల్లే సాధ్యపడుతుందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

ఇచ్ఛాపురం: మండలంలోని లోద్దపుట్టిలో శ్రీసాయి విద్యానికేతన్ విద్యా సంస్థ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. గ్రామపెద్దలు, ప్రముఖులు మాట్లాడుతూ పాఠశాల చిన్నారులు విద్యా సంబంధిత యాక్టివిటీస్, ధారణ శక్తి ప్రదర్శనతో పాటు వివిధ సాంప్రదాయ, జానపద, సినిమా పాటలకు అద్భుతమైన నృత్యాలను ప్రదర్శించారన్నారు. అద్భుత ప్రదర్శన చేసిన విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.హేమలత, భూపతిరావు, చాందిని, సీత, సౌందర్య, భవాని, రేవతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

సంతబొమ్మాళి : బోరుభద్ర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు టెక్కలి విద్యుత్ శాఖ ఇఇ ఈశ్వరరావు, ఎఇ మెట్ట శివకుమార్ తెలిపారు. పిన్నింటిపేట సబ్‌స్టేషన్‌లో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నందున బోరుభద్ర సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు.

కవిటి: మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ కోసం రాజపురం నుంచి వేస్తున్న 33 కెవి పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి కవిటి టౌన్ లైన్ మైంటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో బొర్రపుట్టుగ, తొత్తిడిపుట్టుగ, కవిటి, కొత్తూరు, గొండ్యాలపుట్టుగ, ప్రగడపుట్టుగకు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

ఇచ్ఛాపురం : మండలంలోని ఆంధ్రా బాపిస్ట్ చర్చిలో పాస్టర్ బిమ్మో బెహరా అధ్వర్యాన క్రిస్టియన్లు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, నీలాద్రి బెహరా, రామచంద్ర బెహరా, నిరంజన్ బెహరా పాల్గొన్నారు.